ఎండుతున్న ఎస్సారెస్పీ ఆయకట్టు!

మొదటిపేజీ తరువాయి...

డీబీఎం-5 నుంచి డీబీఎం 54 వరకు జోన్-1గా, డీబీఎం 54 నుంచి డీబీఎం 94 వరకు జోన్-2గా విభజించుకున్నారు. రెండు జోన్లకు ఏడు తడులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో జోన్-1కు 3,500 క్యూసెక్కులు, జోన్-2కు 5,500 క్యూసెక్కుల నీరు ఇవ్వాలని నిర్ణయించారు. జోన్-2 పరిధిలో ఉన్న కరీంనగర్ జిల్లాకు డిసెంబర్ 18 నుంచి 25 వరకు మొదటి తడి, జనవరి 9 నుంచి 17 వరకు రెండో తడి నీటిని విడుదల చేశారు. అయినప్పటికీ, మధ్య ఆయకట్టుకు కూడా సరిగ్గా నీరందని పరిస్థితి నెలకొన్నది.

తడి ఆరుతున్న పొలాలు

కరీంనగర్ జిల్లా పరిధిలో ఎగువ కాకతీయ కాలువకు డీ-87 నుంచి డీ-94 వరకు మొత్తం ఎనిమిది డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. చొప్పదండి, రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ మండలాల పరిధిలో సుమారు 22 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. అయితే, చొప్పదండి, కరీంనగర్ మండలాల్లోని మధ్య ఆయకట్టుకు కూడా నీళ్లందని పరిస్థితి కనిపిస్తున్నది. కరీంనగర్ మండలం బొమ్మకల్, దుర్శేడు, గోపాల్పూర్, చేగుర్తి, ముగ్ధుంపూర్, మందులపల్లి, తదితర గ్రామాలకు ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో సాగు నీరు అందలేదు. దీంతో రైతులు ఎక్కువగా భూగర్భ జలాల మీద ఆధారపడి వరినాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు కూడా అడుగంటుతుండటం రైతులను కలవరపెడుతున్నది. ఒక ప్పుడు రోజుకు 12 గంటలు వాడినా తగ్గని బావులు, బోర్లలో ఇప్పుడు ఐదారు గంటలు కూడా నీళ్లు ఉండటం లేదు. ఇప్పటికే నాట్లు వేసిన పొలాలు తడి ఆరిపోతున్నాయి. అక్కడక్కడా నెరెలు విచ్చుతున్నాయి. మరి కొద్ది రోజులు ఇలాంటి పరిస్థితులే ఉంటే పంటలు ఎండిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ పరిణామాలను గ్రహించిన రైతులు ఇప్పటివరకు పోసిన నారు మళ్లను వదిలేస్తున్నారు. యాసంగిలో నాలుగైదు ఎకరాలు వేసుకోవాలని ఆశించిన రైతులు ఇప్పుడు ఎకరం, అరెకరానికే పరిమితం అవుతున్నారు. మరోవైపు, నీటి ఎద్దడి వస్తుందనే కారణంగా ప్రధాన కాలువ ఎగువ ప్రాంత రైతులు డీబీఎంలను తెరిచి పెడుతున్నట్టు తెలుస్తున్నది. దీంతో చివరి ఆయకట్టు మాట దేవుడెరుగు మధ్య ఆయకట్టు సైతం తడిచే పరిస్థితి కనిపించడం లేదు. అంతేకాకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు వచ్చే నీటిని అడ్డుకోవద్దని మౌఖిక ఆదేశాలు అధికారులకు అందినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో చివరి ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు సాగు చేయడమా? లేదా? అనే సందిగ్ధంలో పడుతున్నారు.

కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో నెరెలు విచ్చుతున్న పొలం

ఇట్లనే ఉంటే రోడ్లెక్కుడైతది..

నిరుడు యాసంగిలో బొమ్మకల్, గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, దుర్శేడు, చేగుర్తిలో ఈ సమయానికే నాట్లేసుడు అయిపోయింది. అప్పుడు నీళ్లు పుష్కలంగా ఉండేది. కరెంట్ సతాయించేది కాదు. ఇప్పుడు నీళ్లు వస్తలేవు. రైతులందరూ బావులు, బోర్ల మీదనే ఆధారపడ్డరు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నయి. నాలుగైదు రోజుల సంది కరెంట్ సతాయిస్తున్నది. గంటకోసారి ట్రిప్పైతంది. మళ్ల మునుపటి పరిస్థితులు వస్తయా ఏందని రైతులందరూ భయపడుతున్నరు. నీళ్లిస్తలేవని రైతులు పోసిన నార్లు వదిలేస్తున్నరు. డిస్ట్రిబ్యూటరీల నుంచి 500 క్యూసెక్కుల నీళ్లు వస్తేనే చివరి ఆయకట్టు వరకు నీళ్లొస్తాయి. కానీ రెండు మూడు వందల క్యూసెక్కుల నీళ్లు మాత్రమే ఇస్తున్నరు. కాలువ మొదట్ల ఉన్న రైతులకే సరిపోత లేవు. మధ్యన, చివరన ఉన్న ఆయకట్టుకైతే ఆయింతకు వస్త లేవు. పట్టించుకునెటోళ్లు కనిపిస్త లేరు. పరిస్థితి ఇలాగే ఉంటే మునుపటి లెక్కనే రైతులు రోడ్లెక్కుడైతది.

- మంద తిరుపతి, గోపాల్‌పూర్ రైతు

ఆశ వదులుకుని మక్క వెట్టుకున్న

కాలువ నీళ్లు వస్తయనే ఆశ వదులుకుని ఈసారి పొలం ఎయ్యలే. మక్క వెట్టిన. బాయిల నీళ్లున్నంత సేపు మక్క పారించుకుంట. బాయి ఎండిపోతే మక్క ఎండుతది. ఏంజేసుడు మరి? మునుపు అంత పొలమే ఏసిన. కానీ, ఇప్పుడు కాలువ నీళ్లు వస్త లేవు కదా. చాలా మందే నాట్లే సుడు బంజేసిండ్రు. నీళ్లు రాక ఎండిపోతే పెట్టుబడులు మీదవడ్తయని భయపడుతున్నరు. ఐదారేండ్ల సంది ఇసోంటి పరిస్థితి రాలే. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చినంకనైతే ఎండకాలం సైతం చెరువుల్లో నీళ్లు ఉండేది. బాయిలు సైతం ఉబ్బుతుండే. వాన కాలం పంట చేతికొచ్చినప్పటి సంది నీళ్లు రాకపాయె. మళ్ల పొలాలు దున్నడానికి బాయిల నీళ్లు వాడుతున్నరు. కరెంటు సైతం ఎద్దెమెద్దెమే వస్తంది. ఈసారి ఎవుసం ఖతమే.

- ఆవుల సంపత్, దుర్శేడు రైతు

వేసింది రెండెకరాలే అయినా..

ఇతని పేరు బూసారపు లక్ష్మణ్. కరీంనగర్ మండలం దుర్శేడు శివారులో ఇతనికి నాలుగెకరాల పొలం ఉన్నది. ఐదారేండ్లుగా వానకాలం, యాసంగి సీజన్లలో మొత్తం నాటు వేస్తున్నాడు. ఒక్క సీజన్‌లో కూడా ఎండకుండా పంట చేతికొచ్చింది. కాలువ నీళ్లు సక్రమంగా రావడంతోనే ఇది సాధ్యమైందని, గతంలో కూడా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలోనే నీళ్లు ఇచ్చినా చివరి వరకు అందాయని లక్ష్మణ్ చెప్తున్నాడు. నీటిని నిలిపేసినపుడు బావుల్లో ఉన్న నీళ్లను వాడుకున్నామని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నాడు. ఈసారి ఉన్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలే సాగు చేసినా నీళ్లు సరిపోక పొలం ఎండిపోతున్నదని వాపోతున్నాడు.

ఇక్కడి వరకు నీళ్లే రాలేదు

ఇది కరీంనగర్ మండలం దుర్శేడులోని డీ-94 ప్రధాన కాలువ. ఇది కొత్తపల్లి మండలం మల్కాపూర్ వద్ద ఎగువ కాకతీయ కాలువకు అనుసంధానంగా ఉండి మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, బొమ్మకల్, గోపాల్‌పూర్, దుర్శేడు, చేగుర్తి, నల్లగుంటపల్లి వరకు సాగు నీటిని అందిస్తుంది. ఇప్పటికే రెండు తడులు వదిలినప్పటికీ బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాలకు చివరి రెండు రోజులు మాత్రమే నీళ్లొచ్చాయి. దీనికి కుడి, ఎడమల్లో ఉన్న పిల్ల కాలువల్లో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తున్నది. నీళ్లు వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. వీటి పరిధిలో సాగు చేస్తున్న రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక పోసుకున్న నార్లను వదిలేస్తున్నారు.

మూడు పిల్లర్లకు డైమండ్ కటింగ్

- మేడిగడ్డలో కొత్తగా పగుళ్లు ఏమీ లేవు
- ఇప్పటికే నిపుణుల బృందం నిర్ధారణ
- మంత్రుల భేటీలోనూ చెప్పిన ఈఎన్సీ
- అయినా ఆగని అసత్య ప్రచారాలు
- విచారణ పేరిట జాప్యానికి కుట్రలు

మేడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతులు

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డలోని మూడు పిల్లర్లను డైమండ్ కటింగ్‌తో తొలగించి తిరిగి నిర్మిస్తే సరిపోతుందని ఈఎన్సీ మురళీధర్ ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ బరాజ్ చుట్టూ జరుగుతున్న అసత్య ప్రచారాలకు తెరపడడం లేదు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 20వ పిల్లర్ కుంగడంతో పక్కనే ఉన్న 19, 21 పిల్లర్లపై భారం పడింది. ఈ నేపథ్యంలో ఈ మూడు పిల్లర్లను డైమండ్ కటింగ్‌తో తొలగించి తిరిగి నిర్మించాలని ఈఎన్సీ పేర్కొన్నారు. విచారణ పూర్తయితే నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ పిల్లర్లను నిర్మించేందుకు సిద్ధంగా ఉందని మంత్రుల సాక్షిగా మేడిగడ్డ వద్ద ఇరిగేషన్ అధికారుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక భేటీలో వివరించారు. ప్రాజెక్టు పరిస్థితిపై గతంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. పరిస్థితి ఇలా ఉంటే బరాజ్‌పై నెలరోజులుగా రోజుకో అసత్య ప్రచారం జరుగుతున్నది. విచారణ పేరిట మరమ్మతు పనులను జాప్యం చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి ప్రచారం చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నత్తనడకన విచారణ

బరాజ్ ఇన్వెస్టిగేషన్ పనులను డైనాసార్, హట్సన్ ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. నెల రోజులుగా విచారణ సాగుతూనే ఉంది. ఈ క్రమంలో బరాజ్‌పై రోజుకో అసత్య ప్రచారం తెరపైకి వస్తున్నది. కొత్త లోపాలను ఎత్తిచూపడం ద్వారా నిర్మాణ పనులను జాప్యం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం బరాజ్ వద్ద డైనాసార్, హట్సన్ ఏజెన్సీలు ఈఆర్టీ, జీపీఆర్ టెస్టులు చేస్తున్నాయి. ఏడో బ్లాక్ వద్ద కాఫర్ డ్యాం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు అన్నారం బరాజ్‌లో 38,28 ఔట్ లెట్ల వద్ద గల సీపేజ్‌లకు ఆప్కాన్స్ సంస్థ మొదటి విడత కెమికల్ గ్రౌటింగ్ పనులు పూర్తి చేసింది. మూసిన సీపేజ్‌లలోని నీరు మరోచోటి నుంచి వచ్చే అవకాశాలున్నాయా? అని పరిశీలిస్తున్నారు. బరాజ్‌లో ఇలాంటి చిన్న చిన్న సమస్యలు సాధారణమేనని, ఏటా ఇలాంటి రిపేరబుల్ సమస్యలకు మెయింటెనెన్స్ చేస్తూ వెళ్తుంటామని, ఇది నిరంతర ప్రక్రియ అని ఇంజినీర్లు చెప్తున్నారు. బ్యాంకర్లు సైతం ప్రతి ఏడాది ప్రాజెక్టు వద్దకు వచ్చి పరిశీలించి వెళ్తుంటారని, ఇది కొత్తేమీ కాదని, ప్రస్తుతం ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి రాద్ధాంతం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సుపరిపాలన అంటే రామరాజ్యమే

రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: సాహసం, కరుణ, కర్తవ్యనిష్ఠకు శ్రీరాముడు ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు. 11 రోజులుగా అనుష్ఠాన దీక్ష పాటిస్తున్న ప్రధానిని అభినందించారు. శ్రీరాముడు మన అత్యుత్తమ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాలకు ప్రతినిధి అని చెప్పారు. సుపరిపాలన అంటే రామరాజ్యమే గుర్తొస్తుందని పేర్కొన్నారు. ఆయన జీవితం , సిద్ధాంతాలు మన చరిత్రలో అనేక భాగాలపై ప్రభావం చూపించాయని, దేశ నిర్మాతలకు ప్రేరణనిచ్చాయని తెలిపారు. సత్యనిష్ఠ గొప్పతనాన్ని రాముడి వల్లే గ్రహించానని గాంధీజీ పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. రామ మందిర ప్రారంభోత్సవంతో దేశమంతా పండుగ వాతావరణం నెలకొందన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ మార్చి 5కి వాయిదా

రెండు రాష్ట్రాల అభ్యర్థన మేరకు నిర్ణయం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ జరపాల్సిన విచారణ మార్చి 5కు వాయిదా పడింది. ఏపీ పునర్విభజన చట్టం-2014 లోని సెక్షన్ 89 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రాజెక్టులవారీగా కృష్ణా జలాలను కేటాయించాలని గతంలో కేంద్ర ప్రభుత్వం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ, వాటి వల్ల ఒరిగేదేమీ ఉండదని, అంతర్‌రాష్ట్ర జల వివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం ట్రిబ్యునల్‌కు విచారణాధికారాన్ని కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయడంతో కేంద్ర ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్-2కు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం నేటి నుంచి ఈ నెల 24 వరకు ఢిల్లీలో కొనసాగాల్సి ఉన్నది. కానీ, ఈ విచారణను వాయిదా వేయాలని తెలంగాణ, ఏపీ విడివిడిగా అప్పీల్ చేశాయి. దీంతో విచారణను మార్చి 5, 6, 7 తేదీలకు వాయిదా వేస్తున్నట్టు ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ ప్రకటించారు.

విచారణ అంశాలను నివేదించిన తెలంగాణ

కేంద్ర ప్రభుత్వ నూతన మార్గదర్శకాలపై అభ్యంతరాలను తెలుపుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, ఈ నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలని ఏపీ వాదించింది. దీన్ని ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేశ్‌కుమార్ తోసిపుచ్చుతూ.. నూతన మార్గదర్శకాల మేరకే విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. విచారణకు సంబంధించిన అంశాలను 6 వారాల్లోగా నివేదించాలని రెండు రాష్ట్రాలను ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇప్పటికే విచారణ అంశాలను ట్రిబ్యునల్‌కు సమర్పించింది. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు, కృష్ణా జలాల పునఃపంపిణీతోపాటు గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలకు సంబంధించిన అంశాలను కూడా అందులో చేర్చింది. అయితే ఏపీ మాత్రం ఇప్పటికీ విచారణ అంశాలను దాఖలు చేయలేదని సమాచారం.

లక్ష పుష్పార్చనలో పాల్గొన్న కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం అద్భుతం

కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్ కితాబు

యాదగిరిగుట్ట, జనవరి 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ పునర్నిర్మాణం మహాద్భుతంగా ఉన్నదని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్ కితాబునిచ్చారు. ఆదివారం ఆయన స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణాలను పరిశీలించారు. ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. మంత్రికి ఆలయ ప్రధానార్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా, ఈవో రామకృష్ణారావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రాజెక్టుల అప్పగింతపై కాంగ్రెస్ కప్పదాట్లు

- నాడు చట్టం చేసి.. నిన్న కేంద్రానికి అప్పగించి.. నేడు బీఆర్ఎస్‌ను బద్నాం చేసే ప్రయత్నాలు
- ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే ద్రోహం
- కేసీఆర్ కృషితోనే జలహక్కులు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించిన అంశంపై కాంగ్రెస్ సర్కార్ కప్పదాటుడు ధోరణి అవలంబిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్రానికి తెగేసి చెప్పలేక గత బీఆర్ఎస్ సర్కార్‌ను బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని తెలంగాణవాదులు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టుల అప్పగింత కొనసాగిందని, తెలంగాణ జలహక్కులను గత సర్కార్ కాలరాసిందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. ఏపీ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పలు అంశాల ద్వారా కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు తీరని ద్రోహం చేసిందని తెలంగాణవాదులు విమర్శిస్తున్నారు. ఇందుకు చట్టంలోని సెక్షన్ 89వ నిబంధనను ఉదహరిస్తున్నారు. అప్పటికే ఆయా రాష్ట్రాల వినియోగంలో ఉన్న నదీ జలాలను మాత్రమే ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేయాలని, బోర్డులను ఏర్పాటు చేసి, ప్రాజెక్టులు నిర్వహించాలని నిర్దేశించింది. నేడు ఆ చట్టం ప్రకారమే కేంద్రంలోని బీజేపీ సర్కార్ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుల గెజిట్‌ను విడుదల చేసింది. ఆ చర్యలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా నిరసించింది. ప్రాజెక్టులను అప్పగించేది లేదని ఖరాఖండిగా తేల్చిచెప్పింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రాజెక్టులను అప్పగించేందుకు సిద్ధమైంది. కేంద్ర జల్‌శక్తి శాఖ ఇటీవల బహిర్గతం చేసిన సమావేశ మినిట్స్ ఆ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి.

కేసీఆర్ కృషితోనే జలహక్కులు

కేసీఆర్ అవిశ్రాంత కృషి, కేంద్రంపై పెట్టిన ఒత్తిడి కారణంగానే నేడు తెలంగాణకు జలహక్కులు సిద్ధించాయి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తెలంగాణకు ఒరిగేదేమీ ఉండబోదని, ఉద్యమంలో ప్రతిధ్వనించిన న్యాయమైన నీళ్ల వాటా ఆకాంక్ష నెరవేరబోదని ఖరాఖండిగా తేల్చిచెప్పడంతో పాటు ఆ విషయాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ దృష్టికి కేసీఆరే తీసుకెళ్లారు. అంత రాష్ట్ర జలవివాదాల చట్టం 1956లో సెక్షన్ 3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి న్యాయమైన నీటి వాటా తేల్చాలని 2014 జూలై14న వినతిపత్రం అందజేశారు. కేంద్రం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తుందనే నమ్మకం కలగకపోవడంతో బీఆర్ఎస్ సర్కార్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2020 అక్టోబర్ 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో సైతం ట్రిబ్యునల్ అంశంపై కేసీఆర్ పట్టుబట్టారు. దీంతో కేంద్రం ఎట్టకేలకు ట్రిబ్యునల్ ఏర్పాటుకు అంగీకరించింది. అటు తరువాత కూడా కేంద్రం అనేక మెలికలు పెట్టినప్పటికీ గత బీఆర్ఎస్ సర్కార్ ఎక్కడా రాజీ పడకుండా ఒత్తిడి చేస్తూ వచ్చింది. ఫలితంగా గత అక్టోబర్‌లో సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపట్టాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో న్యాయమైన నీటి వాటా డిమాండ్లను ట్రిబ్యునల్ ఎదుట వినిపించేందుకు తెలంగాణకు అవకాశం లభించింది.

జేఈఈ మెయిన్ ఇలా ఈజీ!

మొదటిపేజీ తరువాయి...

అవుతుంది. పరీక్షకు సమయం లేనందున రివిజన్ మాత్రమే చేస్తే బెటర్.

- ఈ రెండు రోజుల్లో మాక్ టెస్టులు రాయటం మంచిది.
- ప్రతి సబ్జెక్టులో రెండో సెక్షన్‌లో ఇచ్చే న్యుమరికల్ ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. మొదటి సెక్షన్‌లోని ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు చాయిస్ లేదు.
- నిపుణుల అంచనా ప్రకారం 40 శాతం ప్రశ్నలు నేరుగా ఫార్ములా బేస్డ్, మరో 40 శాతం పాత ప్రశ్నపత్రాల నుంచి, 10 శాతం ప్రశ్నలు పాత జేఈఈ అడ్వాన్స్‌డ్ నుంచి, మిగతా ప్రశ్నలు ఎక్కువ సమయం పట్టేవి ఇస్తున్నారు.
- విద్యార్థుల్లో అత్యధికులు స్టేట్‌మెంట్స్ (వ్యాఖ్యానాలు), అసెర్షన్ (ధ్రువీకరణలు), రీజన్స్ (కారణాలు) తరహా ప్రశ్నల్లో తప్పులు చేస్తున్నారు. ఈ తప్పు జరగకుండా ఫార్ములాలను గుర్తుంచుకోవటం మంచిది.

కొత్త చాప్టర్ల జోలికెళ్లొద్దు

పరీక్షలు సమీపించినందున అన్ని చాప్టర్స్‌ను ఈ సమయంలో ముందేసుకోవద్దు. కొత్త చాప్టర్ల జోలికెళ్లొద్దు. గణితంలో 15, ఫిజిక్స్‌లో 20, కెమిస్ట్రీలో 20 ప్రశ్నలు రాసేలా రివిజన్ చేయాలి. జంక్‌పుడ్‌కు దూరంగా ఉండండి. పండ్ల రసాలు, పండ్లు వంటి సాఫ్ట్‌ఫుడ్ మాత్రమే తీసుకోవడం మంచిది. గణితంలో సెట్ రిలేషన్, సిరీస్, త్రీడీ జామెట్రీ, వెక్టార్స్ ఆల్జీబ్రా, కాంప్లెక్స్ నంబర్స్ వంటి సబ్జెక్టులను రివిజన్ చేయడం ఉత్తమం.

- ఎం నాగభూషన్‌రావు, గణితం సబ్జెక్టు నిపుణుడు

పరీక్ష రోజే అత్యంత కీలకం

ఈ సారి సిలబస్‌ను మార్చారు. కొన్నింటిని తొలగించి, మరికొన్నింటిని కలిపారు. ఇప్పటికే ప్రిపేర్ అయిన విద్యార్థులకు ఇది సష్టం చేకూరుస్తుంది. అయితే సిలబస్ నుంచి తొలగించిన పాఠ్యాంశాల నుంచి గతంలో కఠినమైన ప్రశ్నలొచ్చేవి. వాటినిప్పుడు తొలగించారు. కెమిస్ట్రీ నుంచి అధ్యాయాలను ఎక్కువగా తీసేశారు. ఇది విద్యార్థులకు కాస్త ఉపశమనం. మ్యాథమెటికల్ రీజనింగ్ నుంచి గతంలో 99 శాతం ఒక ప్రశ్న వచ్చేది. కానీ ఇప్పుడు పాఠ్యాంశాన్ని తొలగించారు. ఇలాంటివి చాలా పాఠ్యాంశాలున్నాయి. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో అత్యుత్సాహంతో తెలిసిన ప్రశ్నలకు తప్పులు చేయవద్దు.

- ఎం ఉమాశంకర్, ఆలిండియా ఐఐటీ కో ఆర్డినేటర్, శ్రీచైతన్య విద్యాసంస్థలు

రాష్ట్రంలో పారిశ్రామిక స్తబ్ధత!

- పరిశ్రమలకు ఆగిపోయిన భూ కేటాయింపులు
- కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుపై స్పష్టత శూన్యం
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పరిస్థితి అగమ్యగోచరం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పారిశ్రామికరంగంలో స్తబ్ధత ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే పారిశ్రామిక కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. భూ కేటాయింపుల కోసం వచ్చిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటు ప్రతిపాదనలపై కనీసం ఆలోచన చేసే నాథుడు కూడా లేడు. ప్రభుత్వం చెబుతున్న పారిశ్రామిక క్లస్టర్లపైనా స్పష్టత లేకపోవడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పరిస్థితి అయోమయంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిశ్రమల శాఖ డైరెక్టర్ డిప్యూటీ సీఎం వద్ద కార్యదర్శిగా చేరడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. నెల రోజుల తర్వాత ఆ ఖాళీని ఇటీవలే భర్తీచేశారు. అలాగే టీఎస్ఐఐసీ ఎండీని బదిలీచేసి శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు కల్పించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. వారం రోజులు తిరక్కుండానే తాజాగా ఆ బాధ్యతలను విష్ణువర్ధన్‌రెడ్డికి అప్పగించింది. దీంతో టీఎస్ఐఐసీ ఎండీ పోస్టులో కేవలం నెలరోజుల్లోనే ముగ్గురు మారారు. మరోవైపు వివిధ పారిశ్రామికవాడల్లో భూములు కేటాయించాలని కోరుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన వందల దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతి వారం సమావేశాలు నిర్వహించి ఆ దరఖాస్తులను క్లియర్ చేయాల్సిన అధికారులు.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకూ సమావేశాలు జరపరాదని నిర్ణయించారు. ఫలితంగా రుణాల కోసం బ్యాంకులను సంప్రదిస్తున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పారిశ్రామిక క్లస్టర్లపై లేని స్పష్టత

పరిశ్రమల ఏర్పాటు కోసం రాష్ట్రాన్ని 3 క్లస్టర్లుగా విభజిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఫార్మాసిటీని రద్దుచేస్తామని ఒకసారి, రద్దు చేయడంలేదని మరోసారి చెప్పడం గమనార్హం. దీంతో ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చిన ఔత్సాహికులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. రేవంత్ సర్కారు నిజంగానే కొత్త పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలనుకుంటే కేంద్రం నుంచి మళ్లీ పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అది అనుకున్నంత సులభంకాదని గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ అనుమతులు లభించేందుకు కనీసం రెండు-మూడు ఏండ్లైనా పడుతుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటున్న పారిశ్రామిక క్లస్టర్లపై ఉన్నతాధికారుల్లోనూ స్పష్టత లేదు. వాటి ఏర్పాటు కోసం ఏదైనా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారా? లేక ప్రభుత్వ భూములను గుర్తించి వాటినే పరిశ్రమలకు కేటాయిస్తారా? ఆయా క్లస్టర్లను ఏ తరహా పరిశ్రమలకు ప్రత్యేకిస్తారు? వాటి విధివిధానాలు ఏమిటి? అనేది ఎవ్వరికీ అంతుబట్టడంలేదు. హైదరాబాద్ నగరం నానాటికీ విస్తరిస్తుండటంతో ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)కు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించడంతోపాటు ఆయా పరిశ్రమలకు భూములను సైతం కేటాయించింది. తాజాగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారడంతో పరిశ్రమల తరలింపు ప్రక్రియకు కూడా బ్రేకులు పడ్డాయి.

అగమ్యగోచరంగా కొత్త పారిశ్రామికవాడలు

మరోవైపు టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 70 వరకూ కొత్త పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకోసం వివిధ జిల్లాల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగానే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఆ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. రాష్ట్రంలో వ్యవసాయ దిగుబడులు పెరగడంతో వాటిని ఇక్కడే ప్రాసెస్